
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.23 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/21.9°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



ర్యాలీలో పాల్గొన్న జేసీ అభిషేక్‌కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలే మొదటి టీకా అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పాల్గొనగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ నినాదాలు, ప్రతిజ్ఞ చేశారు. జేసీ మాట్లాడుతూ బిడ్డకు ఒకే జీవణాధారం తల్లిపాలేనన్నారు. తల్లి పాలను తక్కువ చేయకుండా మొదటి ఆరు నెలలూ బిడ్డకు అందించాలని, అప్పుడే తల్లీ బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం, సీడీపీఓలు జయంతి, గాయత్రి, సీపీఓ మహేష్, జిల్లా కోఆర్డినేటర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్లకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. తొమ్మిది జిల్లాల పరిధిలోని కేజీబీవీ హిందీ, ఉర్దూ టీచర్లకు బుక్కరాయసముద్రం సమీపంలోని శ్రీ భారతి డీఎడ్ కళాశాలలో ఈ నెల 3 నుంచి శిక్షణ ఇస్తున్నారు. గురువారం ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను బాగా అర్థం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కేజీబీవీల్లో చదువుకుంటున్న అనాథ, పేద ఆడబిడ్డలను సొంత పిల్లలుగా చూడాలని కోరారు. అడ్మిషన్లు పెంచడానికి కూడా కృషి చేయాలన్నారు. కేజీబీవీ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. జీసీడీఓ కవిత మాట్లాడుతూ శిక్షణలో అనంతపురం, శ్రీ సత్యసాయి, నెల్లూరు, కడప, కర్నూలు నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి 192 మంది హిందీ, ఉర్దూ టీచర్లు హాజరయ్యారన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లను సన్మానించారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా బాస్కెట్‌బాల్ బాలుర జట్టు

ధర్మవరం అర్బన్: జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్, ఉమ్మడి జిల్లాల బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం సత్యసాయి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికలు, బాలుర జట్లను ఎంపిక చేశారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారక సంస్థ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయి పోటీల్లో భాగంగా జట్లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో జోనల్‌స్థాయిలో తిరుపతిలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈజట్లు పాల్గొంటాయన్నారు. శాప్ కోచ్ హుసేన్, సీనియర్ క్రీడాకారులు ప్రకాష్ పాల్గొన్నారు.

ఎంపికైన బాలికల జట్టు
కిరణ్మయి, నిఖ్య, అలేఖ్య, అంజన, యశస్విని, శరణ్య, ప్రియదీప్తి, మనిత, ఇంద్రజ, కేతన, మౌనిక, వైష్ణవి


బాలుర జట్టు
విజయ్ తరుణ్, మంజునాథ్, కార్తీక్‌నాయక్, అశోక్, లక్ష్మీనారాయణ, సాయికుమార్, యేసు, నాగేంద్ర, చైతన్యసాయి, సంతోష్, అబ్దుల్, రోనంక్



బాలికల జట్టు

కమీషన్ల వల.. విలవిల

కాంట్రాక్టర్లకు 'గుడ్డు'కాలం
- మార్చి నుంచి నయాపైసా చెల్లించని సర్కారు
- బిల్లులు రాకున్నా కమీషన్ ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేల పట్టు
- అల్లాడిపోతున్న కాంట్రాక్టర్లు
- ఇప్పటికే కోడిగుడ్ల రవాణా పనులు మొత్తం ఎమ్మెల్యేల అనుచరులకే



బిల్లులతో సంబంధం లేదు. కష్టాలు పడుతున్నా పట్టడం లేదు. కమీషన్లు ముట్టజెప్పాకే మాటలు. లేదంటే కష్టాలే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రజా ప్రతినిధుల కమీషన్ల వలలో చిక్కుకుని కాంట్రాక్టర్లు అల్లాడిపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రజాప్రతినిధుల దెబ్బకు చిన్న చిన్న సివిల్ కాంట్రాక్టర్లు, బిల్డర్లే కాదు అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లు సైతం విలవిలలాడుతున్నారు. 'కోడి ముందా..గుడ్డు ముందా' అనే చిక్కు ప్రశ్నను మరపిస్తూ 'గుడ్డు కాదు.. దుడ్డే ముందు' అన్న విధంగా పరిస్థితి తయారైంది. 'మీకు బిల్లులు ఎప్పుడైనా రానీ.. మాకు కమీషన్ మాత్రం ముందే ఇవ్వాల్సిందే' అంటూ పట్టుబడుతుండడంతో కొన్ని నియోజకవర్గాల్లో కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలు అడిగినంత సమర్పించుకుంటున్న పరిస్థితి.

రవాణా పనులు తమ్ముళ్లకే..
గతంలో కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లే అంగన్‌వాడీలకు వాటిని రవాణా చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని నియోజకవర్గాల్లో కోడిగుడ్ల రవాణా పనులను ఎమ్మెల్యే చెప్పిన వారికి ఇచ్చారు. రవాణాకు సంబంధించిన చెల్లింపులు కాంట్రాక్టరు చేస్తారు. కాంట్రాక్టర్‌కు సమయానికి బిల్లులు వచ్చినా రాకపోయినా 'తమ్ముళ్ల'కు మాత్రం రవాణా ఛార్జీలు ఇవ్వాల్సిందే. లేదంటే ఎమ్మెల్యే నుంచి ఫోన్ వస్తుంది. ఒక్కోసారి రవాణా సమయంలో కోడిగుడ్లు దెబ్బతిన్నా కాంట్రాక్టరే ఆ భారం మోయాల్సి వస్తోంది.

ఆరు మాసాలుగా బిల్లుల్లేవ్..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరు మాసాలుగా కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలో నెలకు 50 లక్షల నుంచి 60 లక్షల గుడ్లు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుత రేట్ల ప్రకారం ఒక్కో కోడిగుడ్డు రూ.6 పైనే పలుకుతోంది. ఈ లెక్కన నెలకు రూ.3.50 కోట్ల వరకూ బిల్లు అవుతుంది. అయితే, రెండు జిల్లాల్లో అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లకు పైసా బిల్లు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ కమీషన్లు ఏడాది ముందే లాగేసుకున్నారు. ఇప్పుడేమో కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అంతా ఆయన ఇష్టం..
కదిరి నియోజకవర్గంలో కోడిగుడ్ల సరఫరా కు సంబంధించి ప్రత్యేక రాజ్యం నడుస్తోంది. ఇక్కడ గుడ్లు సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్‌కు స్థానిక ప్రజాప్రతినిధి చుక్కలు చూపుతున్నారు. తనకే కాంట్రాక్టు ఇవ్వాలని భయపెట్టడంతో కాంట్రాక్టర్ చేసేదిలేక వదిలేశారు. అంతకుముందు కాంట్రాక్టుకు సంబంధించిన డిపాజిట్ డబ్బు కాంట్రాక్టరే బ్యాంకులో చెల్లించినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. దీంతో గుడ్ల కొనుగోలు, రవాణా మొత్తం ప్రజాప్రతినిధి చేతుల్లో జరుగుతోంది.దీంతోఅక్కడ గుడ్లు చిన్నవా, పెద్దవా అని అడిగే సాహసం చేసేవారు లేరు.

అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు	2,302
శ్రీ సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు	2,824
నెలకు అవసరమయ్యే కోడిగుడ్లు	50-60 లక్షలు
నెలకు సగటున కోడిగుడ్ల బిల్లు	రూ. 3.50 కోట్లు
ఆరునెలల బకాయిలు	రూ. 21 కోట్లు

రాష్ట్రం మరో బిహార్‌లా మారింది

- జీసీ నేతలపై దాడులు సరికాదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: బీసీ నేతలపై దాడులకు పాల్పడటం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నేత రామలింగారెడ్డిపై జరిగిన దాడిని ఆమె ఖండించారు. జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ టీడీపీ గూండాలు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. బీసీ నేతలను టార్గెట్‌గా చేసుకొని దాడులకు తెగపడడం రెడ్‌బుక్ రాజ్యంగానికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా గెలవలేకనే దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా చేసుకొని దాడులు చేయడమేకాకుండా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. దాడులు, హత్యలు, అత్యాచారాలతో రాష్ట్రం మరో బిహార్‌లా మారిందన్నారు. కూటమి పాలనలో దాడులు తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు.

ప్రజలకు పండుగ శుభాకాంక్షలు
పెనుకొండ రూరల్: ధనం, ధాన్యం, సంపద, విజయం అందించే మహాలక్ష్మీదేవి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆకాంక్షించారు. ఇందులో భాగంగానే జిల్లా ప్రజలకు ఆమె వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇళ్లూ భోగ భాగ్యాలు సకల సంపదలతో విరాజిల్లాలని దేవుడిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

13న రామగిరి ఎంపీపీ ఎన్నిక

రామగిరి: మరోసారి రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 13న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారి సంజీవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన జీఓ మేరకు ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే ఎన్నికలో సభ్యులు పాల్గొనాలన్నారు. గత డిసెంబర్ నెలలో అప్పటి ఎంపీపీ మీనుగనాగమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే మూడుమార్లు ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. రామగిరి మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. తొమ్మిది స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించింది. కేవలం ఒక్క ఎంపీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని మెప్మా, సెర్ప్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వంద అడుగుల జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పట్టణ పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో టీఎంసీ గంగులయ్య, సెర్ప్ ఏపీఎం రామాంజినేయులు, సీఓలు తౌసిఫ్, నాగేంద్ర, సదానంద, వరలక్ష్మీ, గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న టీచర్ల వేతన వెతలు

సాక్షి ఎఫెక్ట్..

కదిరి: ఎట్టకేలకు బదిలీ అయిన టీచర్ల వేతన వెతలు తీరనున్నాయి. 'బదిలీ టీచర్లకు వేతన వెతలు' శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనానికి ఏపీ విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు స్పందించారు. గురువారం ఆయన అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి సెలవుల్లో బదిలీ అయిన టీచర్లకు ఇంత వరకూ జీతాలు ఇవ్వలేదని పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, ఉపాధ్యాయ సంఘాల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉందని ఆయన వాస్తవ విషయాన్ని ఒప్పుకున్నారు. దీనిపై రోజంతా కసరత్తు చేసైనా సరే..ఆయా టీచర్లందరికీ తక్షణం పొజిషన్ ఐడీలు క్రియేట్ అయ్యేలా తానే దగ్గరుండి సమస్యకు పరిష్కారం లభించేలా చూస్తానన్నారు. పొజిషన్ ఐడీలు క్రియేట్ అయిన వెంటనే డీడీఓలు స్థానిక ఎస్‌టీఓ కార్యాలయాలకు వెళ్లి యుద్ధ ప్రాతిపదికన డీడీఓ లాగిన్ యాక్టివేషన్ చేసుకునేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఏమాత్రం ఆలస్యం చేసినా శుక్ర, శని, ఆది ఇలా వరుసగా 3 రోజులు సెలవులు ఉన్నాయనే విషయం అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

'చిత్రావతి' సుందరీకరణ పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, జేసీ అభిషేక్‌కుమార్ తదితరులు

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో చిత్రావతి నదీ తీర ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. గురువారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న చిత్రావతి నదీ తీర ప్రాంతంలో చేపట్టనున్న పనులను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్, ఎమ్మెల్యే సింధూరారెడ్డితో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిత్రావతి పరిసరాల సుందరీకరణకు జోయాలుకాస్ ఫౌండేషన్ రూ.1.20 కోట్లు వితరణ చేసిందన్నారు. చిత్రావతి నది తీరప్రాంతంలో పార్కు, జిమ్ము తదితర పనులు చేస్తున్నట్లు చెప్పారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌రాజు, ఏఈఈ జానకీబాయ్ పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు బోగీలు

గుంతకల్లు: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం–ధర్మవరం (17215/16) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 10,11వ తేదీల్లో 2టైర్ ఏసీ బోగీ, తిరుపతి–హుబ్లీ (57401/02), తిరుపతి–గుంతకల్లు (57403/04) ప్యాసింజర్ రైళ్లకు 13,14 తేదీల్లో రెండు స్లీపర్ బోగీలను అటాచ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధగంగా తిరుపతి–కదిరిదేవరపల్లి (57405/06) ప్యాసింజర్ రైళ్లకు ఈ నెల 15,16వ తేదీల్లో రెండు స్లీపర్ బోగీలను అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తూకాల్లో నొక్కుడు !



రొద్దం మండలం బొక్సంపల్లిలో త్రాసు మీద గోనె సంచి ఉంచి.. తూకం వేస్తున్నారు. ఫలితంగా ప్రతి కార్డుదారుడికీ సుమారు ఒక టిన్నర కిలో బియ్యం తేడా వస్తోంది. ప్రశ్నించిన వారిపై స్టోర్ డీలర్ పీఎస్ రాజు తిరగబడుతున్నాడు. ప్రభుత్వం నుంచి కమీషన్ తక్కువగా వస్తోందని, ప్రతి నెలా అధికారులకు మామూళ్లు ఇవ్వాలంటే ఈమాత్రం నొక్కాల్సిందేనని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ ఘటన గత జూన్ 1వ తేదీన వెలుగు చూసింది.



ధర్మవరం మండలం రావులచెరువు పంచాయతీ ఆర్.యర్రగుంటపల్లిలో ఒక్క కార్డుకు ఐదు కిలోల చొప్పున బియ్యం తేడా వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈనెల 1న ఓ లబ్ధిదారుడు డీలర్‌తో గొడవకు దిగారు. కావాలంటే సరుకు తీసుకెళ్లు.. లేదంటే అక్కడ పడేసి వెళ్లాలంటూ డీలర్ చెన్నారెడ్డి దబాయించాడు. దీంతో చేసేది లేక లబ్ధిదారుడు ఉన్న సరుకుతో ఇంటికెళ్లాడు. ప్రతి నెలా ఆ స్టోర్‌లో ఇలాంటి పరిస్థితే ఎదురవుతోందని కార్డుదారులు వాపోతున్నారు.

- బియ్యం పంపిణీలో రేషన్ డీలర్ల చేతివాటం
- కార్డుకు ఐదు కిలోల వరకూ కోత
- అధికారులే చెప్పారంటూ దబాయింపు

సాక్షి, పుట్టపర్తి: రేషన్ పంపిణీ అవినీతికి కేరాఫ్‌గా మారింది. డీలర్ల చేతివాటంతో లబ్ధిదారులు నిలువుగా మోసపోతున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కూటమి నేతల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే అధికారుల పేరు చెబుతూ మాట దాటేస్తున్నారు. తూకాల్లో దగా చేస్తూ ప్రతి నెలా రూ.లక్షలు దండుకుంటున్నారు.

రూ.5.62 లక్షల కిలోలు బ్లాక్ మార్కెట్‌కు..
ఇవ్వాల్సిన సరుకుల కంటే ఐదు కిలోల వరకూ ప్రతి నెలా కోత విధిస్తూ రేషన్ డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లాలో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండ, ధర్మవరంలో వెలుగు చూసిన ఘటనలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మొత్తం 5.62 లక్షల కార్డులకుగానూ కార్డుకు కిలో చొప్పున మోసం చేసినా.. 5.62 లక్షల కిలోలు బ్లాక్ మార్కెట్‌కు దర్జాగా తరలించేస్తున్నారు. కిలో రూ.10 ప్రకారం అమ్మినా.. రూ.50 లక్షలు పైగా ఆర్జిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

కార్డుకు ఐదు కిలోల వరకు..
చౌకధాన్యపు దుకాణంలో ఉన్న కార్డుదారుల్లో ప్రతి ఒక్క కార్డుపై ఐదు కిలోల వరకు కోత విధిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో కార్డుకు గరిష్టంగా (ఐదుగురు ఉంటే) 25 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడ తూకం వేసినప్పుడు సరిగ్గానే ఉంటోంది. అయితే ఇంటికెళ్లాక పరిశీలిస్తే అందులో 20 కిలోలు మాత్రమే ఉంటుండటంతో లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. ఒకరిద్దరు తర్వాత వచ్చి అడిగినా డీలర్లు దబాయిస్తున్నారు.

నేరుగా బ్లాక్ మార్కెట్‌కు..
కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే స్టోర్ డీలర్లందరినీ ఒక్కసారిగా మార్పు చేశారు. తమకు అనుకూలంగా ఉన్నోళ్లకు డీలర్‌షిప్ ఇవ్వడంతో అవినీతి దందాకు తెరలేపారు. కూటమి పార్టీల నాయకుల కనుసన్నల్లోనే తూకాల్లో తేడా నిర్వాకం జరుగుతోందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. స్టోర్ డీలర్ల నుంచి మిగిలిన సరుకును నేరుగా బ్లాక్ మార్కెట్‌కు గుట్టు చప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు
తూకాల్లో వ్యత్యాసాన్ని పరిశీలించాల్సిన తూనికలు – కొలతల అధికారులు మామూళ్ల మత్తులో కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. ఆర్నెల్లకు ఓసారి కూడా తనిఖీలు చేయడం లేదు. మరోవైపు పౌరసరఫరాల శాఖాధికారులు ఎలాంటి తనిఖీలు చేయకపోవడంతో డీలర్లు ఆడింది ఆట పాడింది పాటగా మారింది.

రేషన్‌కార్డుల వివరాలు ఇలా..

జిల్లాలో రేషన్ దుకాణాలు	1,367
రేషన్ కార్డుల సంఖ్య	5,62,784
ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం (మెట్రిక్ టన్నుల్లో)	8,700
ఏఏవై (అంత్యోదయ అన్న యోజన) కార్డుదారులకు (కిలోలు)	49,863
పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) కార్డుదారులకు (కిలోలు)	2,36,610

చర్యలు తప్పవు



రేషన్ షాపుల్లో అవకతవకలు చేస్తే చర్యలు తప్పవు. తూకాల్లో తేడా వచ్చినా.. వెంటనే నిలదీయండి. ఇంటికి వెళ్లి వచ్చిన తర్వాత ప్రశ్నిస్తే.. ఫలితం ఉండదు. తూకాల్లో మోసం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేయండి. ఆకస్మిక తనిఖీలు చేసి నేరం రుజువైతే చర్యలు తీసుకుంటాం. మోసాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు.

– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

వర్షపు నీటి నిల్వతోనే భూగర్భ జలాల పెంపు



అర్ధ చంద్రాకారంలో చేపట్టిన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

మడకశిరరూరల్: వర్షపు నీటి నిల్వతోనే భూగర్భ జలాలు పెరుగుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు డీపీఎం లక్ష్మానాయక్ అన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. ఉగ్రేపల్లిలో రైతు కృష్ణమూర్తి పొలంలో వర్షపు నీటి నిల్వ చేయడానికి 5 అడుగులు ఎత్తు రెండు అడుగులు వెడల్పుతో అర్ధ చంద్రాకారంలో చేపట్టిన నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలంలో ఈ విధానంగా నిర్మాణాలు చేసుకొంటే వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు భూమిలోకి నీరు ఇంకిపోతాయన్నారు. దీనివల్ల భూగర్భజలమట్టం స్థాయి మరింతగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యురాలు కీర్తన, ఎంఎంటీఎల్ రమేష్ , సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూసేకరణ వేగవంతం చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకై భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత సమగ్ర నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ అధికారులు, నెడ్‌క్యాప్ అధికారులు, వివిధ సోలార్ పవర్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

కొత్తచెరువు: మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన హరిజన దామోదర, హరిజన లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కిత్తర నారాయణ, మరో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కిత్తర నారాయణ, మరో ముగ్గురు మద్యం సేవించి దామోదర, లక్ష్మయ్యను ఊరి నడిబొడ్డున కులం పేరుతో దూసిస్తూ చెప్పులతో, కాళ్ళతో కొట్టారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

11న జిల్లా జైలులో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో ఈ నెల 11న 25 వేల కిలోల వేరుశనగ చెక్కకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ అనిల్‌బాబు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలం ప్రక్రియలో పాల్గొనే వారు రూ. 20వేల ధరావత్తు చెల్లించాలి. ప్రక్రియ ముగిసిన తర్వాత ధరావత్తును వెనక్కు చెల్లిస్తారు.

కలిసి రాని ఖరీఫ్

కీలకమైన నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే పలకరించినా.. వర్షాలు మాత్రం ఆలస్యంగానే కురిశాయి. రైతులందరినీ సేద్యంలోకి దింపుతూ వరుణుడు మొహం చాటేయడంతో ఖరీఫ్ పంట కాలం కాస్త అన్నదాతలకు కలిసి రాకుండా పోయింది. విత్తు వేసేందుకు వెనుకాడడంతో ఈ ఖరీఫ్‌లో కీలకమైన వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.


కోనాపురం వద్ద సాగు చేసిన వరి పంట


బీడుపల్లిలో నాట్లు వేస్తున్న కూలీలు

- ఆలస్యంగా కురిసిన వర్షాలు
- తగ్గిన వరి సాగు
- 6వేల హెక్టార్లకు గాను 700 హెక్టార్లకే పరిమితం
- రానున్న రోజుల్లో బియ్యానికి కటకటే

పుట్టపర్తి అర్బన్: ఈ ఏడాది రైతులకు ఏదీ కలిసి రాలేదు. ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా సాగయ్యే వేరుశనగ, కంది, వరి తదితర పంటలు తీవ్ర వర్షాభావం కారణంగా విత్తు వేసేందుకు రైతులు భయపడ్డారు. చెరువుల్లోకి నీళ్లు వస్తాయో రావో కూడా తెలియని అయోమయ స్థితిలో ఆయకట్టు భూముల్లో వరి సాగు చేపట్టలేకపోయారు. కేవలం బోరు బావుల కింద మాత్రమే అక్కడక్కడ వరి సాగులోకి వచ్చింది. వరి పంటకు మంచి అదును అయిన జూన్, జూలై మాసాలు వెళ్లి పోయాయి. ఆగస్టులో పంట వేస్తే దిగుబడి అంతంత మాత్రమే ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. వర్షాభావం కారణంగా బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గనుండడంతో తక్కువ నీటితో సాగయ్యే వేరుశనగ, మొక్కజొన్న, రాగి తదితర పంటలను మాత్రమే సాగు చేస్తున్నారు. సాధారణంగా నాలుగు నుండి ఆరు నెలల పంట కాలమైన వరి సాగుకు చాలా మంది రైతులు వెనుకంజ వేశారు. ఫలితంగా రాబోవు రోజుల్లో బియ్యానికి ఇబ్బందులు తప్పవనే సంకేతాలు ప్రజలను కలవరపరుస్తోంది.

గణనీయంగా తగ్గిన వరి సాగు

జిల్లాలో సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరి సాగు చేస్తారు. 6,396 హెక్టార్లలో వరి సాధారణ సాగు కాగా, ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకూ 720 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. వరి సాగుకు ఈ ఏడాది ఖర్చులు కూడా భారీ పెరిగాయని రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్ బాడుగలు, కూలీలు, ఎరువులు, మందుల పిచికారీకి ఎకరాకు సుమారు రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకూ ఖర్చు అవుతోందన్నారు. ఇక ఆగస్టులో సాగు చేసిన వరి పంటకు అధికంగా చీడపీడలు ఆశిస్తాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు పంట ఆలస్యమయ్యే కొద్దీ మంచు కురిసే సమయం వస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

ఖర్చులు పెరిగాయి



వరి సాగుకు ఈ ఏడాది ఖర్చులు భారీగా పెరిగాయి. కూలీల ఖర్చు, ట్రాక్టర్, ఎరువులు, మందుల ఖర్చు తడిసిమోపెడైంది. కూలీలు కూడా అందుబాటులో లేరు. వర్షాలు కురవకపోతే బోర్లలో నీళ్లు తగ్గుతాయని ఆందోళనగా ఉంది.

– దాసిరెడ్డి, బీడుపల్లి, పుట్టపర్తి మండలం

మూడు ఎకరాల్లో సాగు చేశా



ముందస్తు వర్షాలతో చెరువుకు నీళ్లు వస్తాయని చాలా ఆశగా ఉండేది. అయితే ఇప్పటి వరకూ చుక్క నీరు కూడా చెరువులోకి రాలేదు. దీంతో మూడు ఎకరాల్లోనే వరి సాగు చేశా. ఇప్పటికే రూ.50 వేలకు పైగా ఖర్చు చేశాను. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తితే ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కిష్టప్ప, గువ్వలగుట్టపల్లి, పుట్టపర్తి మండలం

ఉప ఎన్నికను హింసాత్మకంగా మార్చారు

- మాజీ మంత్రి శంకరనారాయణ



సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో ఉప ఎన్నికలను టీడీపీ నేతలు హింసాత్మకంగా మార్చారంటూ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనాయణ ధ్వజమెత్తారు. ఏకంగా ప్రజాప్రతినిధులపైనే దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మరో నేతపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. రాష్ట్రంలో అభివృద్ధి మూరెడు అరాచకం బారెడుగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు అభివృద్ధిని పక్కన పెట్టి ప్రత్యర్థి పార్టీ నాయకులే లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

ఎన్నికల్లో గెలవలేరనే దాడులు

- ఎమ్మెల్సీ మంగమ్మ



పుట్టపర్తి టౌన్: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలవలేరని స్పష్టం కావడంతో అక్కసు తాళలేక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మరో నేతపై టీడీపీ గుండాలు దాడికి తెగబడ్డాయని ఎమ్మెల్సీ మంగమ్మ మండిపడ్డారు. దాడిని ఆమె ఖండించారు. దాదాపు వంద మంది కట్టెలు, రాళ్లతో దాడులకు తెగబడి భయానక వాతావరణం సృష్టించారన్నారు. సుపరిపాలన చేయడం చేతకాక రెడ్‌బుక్ రాజ్యాంగంతో దౌర్జన్యాలకు తెరలేపారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో 2019 నుంచి 2024 మధ్య ఇలాంటి దాడులు ఎన్నడూ జరగలేదని గుర్తు చేశారు.

గోరంట్లలో చైన్ స్నాచింగ్

గోరంట్ల: వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. గురువారం సాయంత్రం గోరంట్ల పట్టణానికి చెందిన నాగిరెడ్డి భార్య శ్రీలత, మరో మహిళ శింగిరెడ్డిపల్లి వైపు వాకింగ్‌కు వెళ్తుండగా గోరంట్ల వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు శ్రీలత మెడలోని బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆంజనేయులు (42) అనే పేరు తప్ప మిగిలిన వివరాలు తెలియరాలేదని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 2న సాయంత్రం అతన్ని కొందరు తీసుకువచ్చి ఆస్పత్రి అత్యవసర విభాగం వార్డులో చేర్చి, వెళ్లిపోయారన్నారు. వైద్య పరీక్షల్లో ప్రాణాంతక రెట్రో వైరల్ డిసీజ్‌తో బాధపడుతున్నట్లుగా నిర్ధారణ అయిందన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు కేర్ అండ్ సపోర్ట్ సెంటర్‌కు తరలించి చికిత్స అందించామన్నారు. రోగిని స్వస్థలం, తల్లిదండ్రుల పేర్లు అడగడానికి ప్రయత్నించగా ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదన్నారు. తాను ఒక అనాథగా చెప్పుకున్నాడన్నారు. నిర్దిష్టంగా ఓ ఊరు అంటూ లేదని ఫుట్‌పాత్‌లపై జీవనం సాగించేవాడినని తెలిపాడన్నారు. అంతకు మించి వివరాలు ఏమీ తెలపలేకపోయాడన్నారు. చికిత్సకు స్పందించక మంగళవారం మృతి చెందాడని, దీనిపై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు బత్తలపల్లి పోలీసులు, ఆర్డీటీ ఆస్పత్రికి సమాచారం ఇవ్వాలని ఆర్డీటీ యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో కోరింది.

చేనేత రంగాన్ని అభివృద్ధి చేస్తాం

- మంత్రి సత్యకుమార్


చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: రాష్ట్రంలో చేనేత రంగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ధర్మవరంలోని కదిరిగేటు వద్ద గురువారం చేనేత విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి, మాట్లాడారు. సంస్కృతికి, మన ప్రత్యేకతకు నిదర్శనంగా ఉన్న చేనేత రంగాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చేనేత మగ్గాల నిర్వహణకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి నేరుగా రూ.25వేలు చెల్లిస్తామన్నారు. చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రా మెటీరియల్ సరఫరా పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో రూ.164కోట్లు చెల్లించగా, ఇందులో రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించినట్లు వెల్లడించారు. మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను ధర్మవరంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇందు కోసం మార్కెట్ యార్డులో 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి త్వరలో భూమిపూజ నిర్వహించనున్నామన్నారు. ధర్మవరం పట్టణంలో నెలకొన్న అధిక లోడ్ సమస్యపై విద్యుత్‌శాఖతో సంప్రదించి ప్రత్యేకంగా రూ.110 కోట్లతో వ్యయంతో కొత్త విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతి పొందే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇది పూర్తయితే ధర్మవరంలో మగ్గాలకు ఎలాంటి విద్యుత్ లోపం ఉండదన్నారు. అనంతరం ఉత్తమ చేనేత కార్మికులుగా ఎంపికైన కాంతమ్మ, ఆంజనేయులు, ఈశ్వరయ్య, రామకృష్ణను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్, పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి, చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

రొద్దం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం మండలం నల్లూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన రెడ్డిపల్లి గంగన్న కొడుకు శ్రీనివాసులు(40)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన శ్రీనివాసులు తరచూ తాగుడుకు డబ్బులు ఇవ్వాలంటూ ఇంట్లో గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో గొడవ పడి డబ్బులు ఇవ్వకపోవడంతో ద్విచక్ర వాహనంలోని పెట్రోల్ తీసి శరీరంపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు మంటలు ఆర్పి కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

కర్ణాటక వాసి దుర్మరణం


నుజ్జునుజ్జయిన బొలెరో

నల్లచెరువు: మండల కేంద్రానికి సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో కర్ణాటక వాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని చిక్కబళ్లాపురం జిల్లా దిబూరహళ్లికి చెందిన వరుణ్ కుమార్ (32) బొలెరో వాహన డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గురువారం నల్లచెరువు సంత తోపు వద్ద బొలెరో వాహనంలో ఖాళీ క్రేట్లను లోడ్ చేసుకుని జాతీయ రహదారి మీదుగా కదిరి వైపుగా బయలుదేరాడు. నల్లచెరువు శివారులోకి చేరుకోగానే ఎదురుగా కదిరి వైపు నుంచి ఎల్పీజీ సిలిండర్లతో మదనపల్లి వైపుగా వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో బొలెరో నుజ్జునుజ్జయింది. వరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో యువకుడి మృతి


అనిల్‌కుమార్ (ఫైల్)

పరిగి: పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు... పరిగి మండలం కాలువపల్లికి చెందిన నాగేశ్వర రావు అలియాస్ కన్నప్ప కుమారుడు అనిల్‌కుమార్ (22) ఇంటి పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. బుధవారం రాత్రి తనకున్న ఇటుకల బట్టీ వద్ద ఉన్న గదిలో నిద్రించేందుకు మిత్రుడు శివయ్యతో కలిసి వెళ్లాడు. గురువారం వేకువజామున 3 గంటల సమయంలో అనిల్‌కుమార్‌కు ఏదో కుట్టినట్లయింది. గమనించి చీమ కుట్టి ఉంటుందని భావించి అలాగే పడుకున్నాడు. కాసేపటి తరువాత వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన శివయ్య వెంటనే తండ్రి కన్నప్పకు ఫోన్ సి, హుటాహుటిన హిందూపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎడమ చెవి వద్ద రెండు గాట్లను గమనించిన వైద్యులు పాము కాటుకు గురైనట్లు నిర్ధారించారు. చికిత్సకు స్పందించక ఉదయం 6 గంటల సమయంలో మృతి చెందాడు. కన్నప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్ రమణ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

- క్రిమినల్ కేసు నమోదుకు అనంత ఇన్‌చార్జ్ కలెక్టర్ సిఫారసు

అనంతపురం మెడికల్: గర్భిణి మృతి అంశానికి సంబంధించి ప్రభుత్వ సర్వజనాస్పత్రి సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్‌కు చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఈ నెల 3న చెదళ్ల గ్రామానికి చెందిన గర్భిణికి రాధమ్మ(29)కు శ్రీనివాసనగర్‌లోని శ్రీకృప ఆస్పత్రిలో డాక్టర్ రమణనాయక్ సర్జరీ చేస్తుండగా ఆపరేషన్ టేబుల్‌పైనే మృతి చెందిన విషయం తెలిసిందే. గతంలో సీజ్ చేసిన ఆస్పత్రిని గుట్టుచప్పుడుగా తెరిచి శస్త్రచికిత్సలు చేయడంతో పాటు పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అతిక్రమణ, తదితర తప్పిదాలు చేసినట్లు డాక్టర్ రమణ నాయక్‌పై అభియోగాలు మోపుతూ అనంతపురం ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ కలెక్టర్... డాక్టర్ రమణనాయక్‌పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశారు. కాగా, కేసు నమోదుకు మూడో పట్టణ పీఎస్ సీఐ శాంతిలాల్ నిరాకరించడంతో ఈ నెల 6న ఎస్పీని కలిసేందుకు ఆరోగ్యశాఖ డెమో సిబ్బంది, లీగల్ అడ్వైజర్ వెళ్లారు. ఆ సమయంలో ఎస్పీ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా డాక్టర్ రమణ నాయక్ సెలవులో వెళ్లినట్లు తెల్సింది. అలాగే గర్భిణి మృతికి సంబంధించి సమగ్ర దర్యాప్తునకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో వీఆర్‌ఓ అరెస్ట్


వీఆర్‌ఓ వలిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: ఏడు నెలల గర్భిణిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో వీఆర్‌ఓను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గుంతకల్లులోని సోఫియా స్ట్రీట్‌కు చెందిన షేక్ షమీమ్ భాను తన కుమారుడి పేరును రేషన్ కార్డులో నమోదు చేయించుకునేందుకు సచివాలయానికి వెళ్లిన సమయంలో వీఆర్‌ఓ మహమ్మద్ వలి పరిచయమయ్యాడు. అనంతరం ఆమెకు మాయమాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. షమీమ్‌కు సంబంధించిన బంగారాన్ని ఆమె పేరిట బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.2 లక్షల రుణం తీసుకున్న వలి ఆ డబ్బును తన స్వప్రయోజనాలకు వాడుకున్నాడు. అనంతరం ఆమె బాగోగులు పట్టించుకోలేదు. భర్త చేసిన మోసంపై గత నెల 14న గుంతకల్లు వన్‌టౌన్ పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తనపై కేసు నమోదు చేయించినందుకు కక్ష కట్టి ఆమెను వేధింపులకు గురిచేస్తూ 'ఎక్కడైనా పడి చావు.. నువ్వు చచ్చిపోతే నాకు మనశ్శాంతిగా ఉంటుంది' అని నిర్దయగా మాట్లాడాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన షమీమ్ బుధవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి షేక్ పీర్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వీఆర్‌ఓ వలిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గేలి చేయడాన్ని జీర్ణించుకోలేకనే హత్య

- మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుడి అరెస్ట్

పరిగి: తనను గేలి చేయడాన్ని జీర్ణించుకోలేకనే సన్నక్కను హతమార్చినట్లు నిందితుడు అంగీకరిస్తూ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. వివరాలను పరిగి పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాఘవన్, ఎస్‌ఐ రంగడు యాదవ్ వెల్లడించారు. కొడిగెనహళ్లి పరిధిలోని బిందూనగర్ సమీపంలో గత ఆదివారం బోయ సన్నక్క అలియాస్ సన్నమ్మ(50) హత్యకు గురైన విషయం తెలిసిందే. హతురాలి కుమార్తె అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో గురువారం కొడిగెనహళ్లి వీఆర్వో కృష్ణమూర్తి సమక్షంలో పరిగి పీఎస్‌లో శ్రీరంగరాజుపల్లికి చెందిన బోయ నాగరాజు లొంగిపోతూ సన్నక్క హత్యకు దారి తీసిన కారణాలు వెల్లడించాడు. దశాబ్ద కాలంగా ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ అతనితో సన్నక్క సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో ఆమెతో నాగరాజు పరిచయం పెంచుకున్నాడు. తాను కలసిన ప్రతిసారీ ఆమె అవమానకంగా మాట్లాడుతూ హేళన చేస్తుండడంతో సన్నక్కపై నాగరాజు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే గత ఆదివారం రాత్రి గ్రామ శివారులోని మైదాన ప్రాంతానికి ఇద్దరూ చేరుకున్నారు. కాసేపటి తర్వాత కట్టెతో సన్నక్క తలపై దాడి చేసి, హతమార్చి నాగరాజు అక్కడి నుంచి ఉడాయించాడు. ఘటనపై హతురాలి కుమార్తె అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో హత్య చేసింది తానేనని ఒప్పుకుంటూ వీఆర్వో కృష్ణమూర్తి సమక్షంలో పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రంగడుయాదవ్ ఎదుట నాగరాజు లొంగిపోయాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

అనంతపురం: రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రతన్ టాటా ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్ డైరెక్టర్ శివ్ నారాయణ శర్మ అన్నారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురంలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ హబ్ కేంద్రంలో బోర్డు సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక బాధ్యత కింద పారిశ్రామిక సంస్థల ద్వారా నిధులను సమకూర్చడం జరుగుతుందన్నారు. సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సోలార్ ఎనర్జీ ఇండస్ట్రీలలో ఎక్కువగా యువత ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉంటాయన్నారు.

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు


హెడ్ కానిస్టేబుల్ రమేష్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: అనారోగ్యంతో మృతి చెందిన కంబదూరు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ మృతదేహానికి అనంతపురంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం అనంతపురంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం ఆరో రోడ్డులోని శ్మశాన వాటికలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠ, ఎస్‌ఐ లోకేష్, కంబదూరు ఏఎస్‌ఐ ఓబుళపతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు , బంధువులు పాల్గొన్నారు. కాగా, రమేష్ మృతిపై ఎస్పీ జగదీష్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. తక్షణ సాయం కింద రూ.లక్షను రమేష్ భార్య రామలక్ష్మికి అందజేశారు.

నేడు వరలక్ష్మి వ్రతం

పుట్టపర్తి టౌన్: వరాలిచ్చే కల్పవల్లి వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకునేందుకు జిల్లాలోని మహిళలు సిద్ధమయ్యారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో నేడు (శుక్రవారం) వరలక్ష్మి వ్రతానికి ఏర్పాట్లను ముందురోజే గురువారం సిద్ధం చేసుకున్నారు. దీంతో పూజాసామగ్రి కొనుగోళ్లతో వ్యాపార కేంద్రాలు కిటకిటలాడాయి. జిల్లా వ్యాప్తంగా పండ్లు, పూలు ధరలను వ్యాపారులు పెంచి విక్రయాలు చేపట్టారు.


హిందూపురంలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం